క్లుప్తంగా

నేడు గోగులమ్మ తల్లి తీర్థం

బిక్కవోలు: మండలంలో కొమరిపాలెం గ్రామంలో ఆదివారం జరగనున్న గోగులమ్మ తల్లి తీర్థానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మాఘమాసం అమావాస్య తరువాత ఐదో రోజు ఈ తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కొమరిపాలెం శివారు పంట పొలాల్లో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి కొమరిపాలెంతో పాటు తొస్సిపూడి, బలభద్రపురం, పందలపాక, కొప్పవరం తదితర గ్రామాల ప్రజలు వస్తుంటారు. భక్తుల కోసం అన్న సమారాధన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జాబ్‌మేళాలో 64 మంది ఎంపిక



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు, అధ్యాపకులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 64 మంది ఎంపికయ్యారు. శనివారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వికాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్ మేళాలో ఐసీఐసీఐ, డెక్కన్ కెమికల్స్, ఐసస్ వంటి పలు కంపెనీలు పాల్గొన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు విలేకరులతో మాట్లాడుతూ జాబ్ మేళాకు 120 మంది అభ్యర్థులు హాజరుకాగా 64 మందికి ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. ఎంపికైన వారికి అపాయింట్మెంట్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు.

ఒకటిన ఆంజనేయుని కల్యాణోత్సవం

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలో కొలువైన సువర్చలాదేవి సమేత అభయ ఆంజనేయ స్వామి ఐదో వార్షిక కల్యాణోత్సవాలు మార్చి ఒకటో తేదీన నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 7.30 గంటలకు కలశపూజ అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత మంగళ స్నానం, స్నపనములాచరించి స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపేలా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. అన్న సమారాధన నిర్వహిస్తారన్నారు.

హుండీ ఆదాయం రూ.5.92 లక్షలు



స్వామి వారి ఆదాయ లెక్కింపును పరిశీలిస్తున్న ఈఓ కొవ్వూరి గాయత్రి

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామి వారి హుండీ ఆదాయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. ఎనిమిది నెలల కాలానికి గాను రూ.5,92,120 వచ్చిందని ఆలయ ఈఓ కొవ్వూరి గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా గతేడాది కంటే ఆదాయం పెరిగినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 28న వాహనాలకు వేలం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. 10 ద్విచక్రవాహనాలు, ఒక మూడు చక్రాల వాహనం కలిపి మొత్తంగా 11 వాహనాలకు 28వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు స్థానిక సెబ్ స్టేషన్ ఆవరణలో వేలం పాట నిర్వహిస్తామన్నారు. ధరావత్తు సొమ్ము చెల్లించి వేలం పాటలో పాల్గొనొచ్చని చెప్పారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ



తొస్సిపూడిలో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులతో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐబీఎస్‌డీపీ చింతలపూడి వెంకట సత్యవతి మాట్లాడుతూ నవ ధాన్యాల సాగు-నేల తల్లికి బాగు పేరుతో నవధాన్యాల సాగు వల్ల లాభాల్ని, సాగు విధానాల్ని వివరించారు. నవధాన్యాల సాగు వల్ల భూసారం పెరిగి తరువాత వేసే పంట దిగుబడి శాతం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కొక్కిరి మెట్ల పుల్లయ్య కాపు, గుబ్బల ఈశ్వర్‌కుమార్, సత్యవరపు రాణి, రైతు కొవ్వూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్టలో సిరులు కురిపిస్తున్న తైవాన్ జామ

- కిలో రూ.60 పలుకుతున్న జామ
- అధిక దిగుబడినిస్తున్న తోటలు
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు



విరగకాసిన తైవాన్ జామ చెట్టు

రంగంపేట: మెట్ట రైతులు శాస్త్ర, సాంకేతికతలను ఉపయోగించుకుని పండ్ల తోటల సాగుకి ఆసక్తి చూపుతున్నారు. మెట్టప్రాంత మండలాలైన రంగంపేట, గండేపల్లి, జగ్గంపేట మండలాల్లోని పలు గ్రామాల్లో తైవాన్ జామ సాగును రైతులు ప్రయోగాత్మకంగా చేపట్టారు. సాధారణంగా ఇక్కడ వరి, పత్తి, మినుము, మిరప, శనగ, మొక్కజొన్న, బొప్పాయి తదితర పంటలు రైతులు పండిస్తారు. అయితే వాతావరణ పరిస్థితుల కారణంగా ఆశించినంత దిగుబడి రాకపోవడం, సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అందుకు ప్రత్యామ్నాయంగా తైవాన్ జామ సాగును ఎంచుకుంటున్నారు. ఇది మంచి ఫలితాలనిస్తుండడంతో మరింత మంది అన్నదాతలు వీటి సాగుకు ముందుకొస్తున్నారు.

తొలి ఏడాదే పెట్టుబడి చేతికి

రంగంపేట మండలంలో సుమారు 120 ఎకరాల్లో, గండేపల్లి మండలంలో సుమారు 100 ఎకరాల్లో, జగ్గంపేట మండలంలో 50 ఎకరాల్లోను వివిధ రకాల జామ తోటలు సాగుచేస్తున్నారు. తైవాన్ జామ మొక్కలు నాటిన మొదటి సంవత్సరం నుంచే దిగుబడి తీసుకునే అవకాశం ఉండటంతో రైతులు తైవాన్ జామ సాగుపై మక్కువ చూపుతున్నారు. ఎకరా భూమిలో 800 నుంచి 1000 మొక్కలు వరకూ నాటుతున్నారు. కడియం, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి మొక్కలు కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. మొక్కలు నాటిన 11 నెలలకే మొదటి కాపు రైతు చేతికి అందుతుండటంతో రైతులు మంచి ఫలితాలు పొందుతున్నారు. రంగంపేట మండలంలోని పెదరాయవరం గ్రామానికి చెందిన మద్దిపాటి సూరిబాబు అనే రైతు తొలిసారిగా 11 కుంచాల భూమిలో తైవాన్ జామ సాగు చేపట్టారు. దీనికోసం డ్రిప్‌ను సైతం ఏర్పాటు చేసి తైవాన్ రెడ్‌లేడీ అనే రకం మొక్కలను ఒక్కొక్కటి రూ.60కు కొనుగోలు చేసి తోటను పెంచారు. ఈ రకం మొక్కలు సుమారుగా 10 సంవత్సరాల వరకు దిగుబడిని ఇస్తాయని చెబుతున్నారు. మొదటి సంవత్సరం రూ.1.20 లక్షలకు తోటలో దిగుబడిని విక్రయించినట్లు తెలిపారు. మొదటి ఏడాదిలోనే పెట్టుబడి చేతికొస్తుందని, రెండో ఏడాది నుంచి లాభాలను ఆర్జించొచ్చన్నారు.



పెదరాయవరంలో సాగు చేసిన తైవాన్ జామ తోట

పోషక విలువలు ఉండటంతో

తైవాన్ జామలో ఎన్నో రకాలున్నా ప్రధానంగా కాయలోపల ఎరుపు, గులాబీ రంగు ఉండి, గింజలు చిన్నగా ఉండి కాయ మందంగా ఉండే రకాలను సాగుచేస్తున్నారు. రుచితో పాటు కాయలు గుల్లగా ఉండటంతో తినడానికి ఎంతో సౌకర్యంగా ఉంటున్నాయి. పిండి పదార్థం ఎక్కుగా ఉంటుంది. వృద్ధులు సైతం తినడానికి వీలుగా ఉంటుంది. జామ కాయల్లో కాల్షియం, పొటాషియం, ఐరన్‌తో పాటు విటమిన్ ఏ, బీ, సీ తదితర పోషక విలువలుంటాయి. ముఖ్యంగా షుగర్ వ్యాధి ఉన్న వారికి జామ కాయలు ఎంతో మేలు చేస్తాయి కాబట్టి వీటికి డిమాండ్ బాగా పెరిగింది. ఏదైతేనేం మెట్టలో తైవాన్ జామ సాగు ఊపందుకోవడం శుభ పరిణామం అని రైతులంటున్నారు.

పేదవాడి యాపిల్‌కు డిమాండ్

పేదవాడి యాపిల్‌గా చెప్పుకునే జామకాయలు ఇప్పుడు ఖరీదైన పండ్ల సరసన చేరాయి. ఈ తోటల్లోని కాయలను వ్యాపారులు టన్నుల లెక్కన కొనుగోలు చేసి ఏడీబీరోడ్డు వెంబడి పలు సెంటర్లలో కేజీ రూ.50కు విక్రయిస్తున్నారు. పెద్దసైజు కాయలు కేజీకి 3 నుంచి 4 తూగుతుండగా, మీడియం సైజు 6 నుంచి 8 కాయలు తూగుతున్నాయి. దీంతో ఏడీబీరోడ్డులో ప్రయాణించే వాహనచోదకులు తాజాగా ఉన్న జామ కాయలను జోరుగా కొంటున్నారు. మరికొంత మంది వ్యాపారులు కాకినాడ, రాజమహేంద్రవరం వంటి పట్టణాలకు తీసుకువెళ్లి కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు.

లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాం



కోటపాడులోని 5 ఎకరాల భూమిని ఎకరానికి ఏడాదికి 23 వేలు చొప్పున 5 సంవత్సరాలకు లీజుకు తీసుకుని తైవాన్ జామ మొక్కలు నాటాం. మొక్కలు నాటి 11 నెలలు గడిచింది. ప్రస్తుతం మొక్కల నిండా పిందెలు వచ్చాయి. మరికొద్దిరోజుల్లో మొదటి కాపు దిగుబడికి వస్తుంది. కాయల్ని కాకినాడ, రాజమహేంద్రవరానికి తీసుకెళ్లి కేజీల చొప్పున విక్రయిస్తాం.

– ఉల్లి భాస్కరరావు, రైతు, కోటపాడు

ప్రత్యామ్నాయంగా తైవాన్ జామ



వరి, మినుము, శనగ, పత్తి వేసే పొలంలో దిగుబడులు ఆశించినంతగా రావడం లేదు. అందుకే ప్రత్యామ్నాయంగా గతేడాది తైవాన్ జామ సాగు చేశాను. మొదటి ఏడాది దిగుబడి చాలా బాగుంది. రూ.1.20 లక్షలకు దిగుబడిని విక్రయించాను. మొదటి ఏడాదిలోనే పెట్టిన పెట్టుబడి దక్కింది. ఈ ఏడాది నుంచి వచ్చేదంతా లాభమే.

– మద్దిపాటి సూరిబాబు, రైతు, పెదరాయవరం

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ మాసం సందర్భంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక తులసి పూజ, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వేంకటేశ్వరునికి పూజలు


మధురపూడి: కోరుకొండ మండలం గాడాల వినాయక సాయి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు తాడి రజనీరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజనీరెడ్డిని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లాకార్యదర్శి కొండపల్లి దుర్గారావు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



ప్రత్యేక అలంకరణలో ఉన్న వేంకటేశ్వరస్వామి వారు

మట్టితో మహాత్ముని విగ్రహం

అనపర్తి: జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని మట్టితో అద్భుతంగా ఆవిష్కరించారు ఆ చిన్నారులు. స్థానిక శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జి.వెంకట సతీష్, టి.చైతన్యలు హిందీ ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా జీవకళ ఉట్టిపడేలా మట్టితో తయారుచేసిన మహాత్ముని నమూనా విగ్రహం అందరినీ ఆకట్టుకుంది. ఉపాధ్యాయుడు విజయమోహన్ పర్యవేక్షించారు. అనుభవజ్ఞుడైన శిల్ప కళాకారుడు తయారు చేసినట్లుగా ఉన్న ఈ విగ్రహాన్ని చూసిన ప్రధానోపాధ్యాయుడు నల్లమిల్లి సత్తిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులు మట్టితో తయారు చేసిన గాంధీజీ విగ్రహం

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

గోకవరం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పి.వీణాదేవి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి, వెదురుపాక లే అవుట్లలో లబ్ధిదారులతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. గృహనిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయి, నిర్మాణానికి అవసరమైన సామగ్రి సక్రమంగా అందుతున్నాయా? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. మొత్తం 328 లబ్ధిదారులకు సంబంధించి గృహ నిర్మాణాలు నాలుగు స్థాయిల్లో ఉన్నట్లు గుర్తించారు. 150 మార్చి నాటికి 150 ఇళ్లను పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణ సంస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుందం శ్రీనివాసరావు, ఈఓ రాజేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిబాబు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



గృహనిర్మాణాల ప్రగతిపై లబ్ధిదారులతో సమీక్షిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ వీణాదేవి

బాలలతోనే సమాజాభివృద్ధి



బాలోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి



ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రకాశం నగర్: బాలలతోనే సమాజభివృద్ధి సాధ్యం, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి సమాజానికి అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో 'గోదావరి బాలోత్సవాలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా జాతీయ పతాకాన్ని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆవిష్కరించగా, గోదావరి బాలోత్సవం పతాకాన్ని చిన్నారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో బాలోత్సవం మొదటి పిల్లల పండుగను నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే కాదని, అన్ని అంశాలపైనా అవగాహన అవసరమన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అవసరమైన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా బాలలు చేసిన పలు సంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్నికి సీనియర్ జర్నలిస్టు వీవీఎస్ కృష్ణకుమార్ అధ్యక్షత వహించగా, పీఏ రాజబాబు, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, ఆలపాటి నాగేశ్వరరావు, తలారి వాసు, చైతన్య శేఖర్, పి.తులసి, తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజాను కలిసిన పోసికుమార్

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముత్యాల పోసికుమార్ దివ్యాంగుల బృందంతో కలిసి శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు ఐక్యమత్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగ సంఘ నాయకులు కండెల్లి రజనీకుమార్, కేవీఆర్ సాగర్, పుష్కర్, బాషా, పలివెల సత్యవేణి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జక్కంపూడి రాజాను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోసికుమార్

వివాదంలో ఇరువర్గాలపై కేసు

బిక్కవోలు: మండలంలోని రంగాపురం గ్రామంలో జరిగిన వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు శనివారం రాత్రి తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం రంగాపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి మేరికి చెందిన స్థలంలో కొమరపు ఆనందరావు గ్రావెల్ వేయడంతో ఇరువర్గాల మధ్య వివాదం రేగి కొట్లాట వరకు చేరుకుంది. దీనిపై ఇరువర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు చెప్పారు.

రంగాపురంలో ఎక్సైజ్ శాఖ తనిఖీలు

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో ఎక్సైజ్ శాఖ తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో రెడ్ గ్రామంగా గుర్తించిన రంగాపురంలో శనివారం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్‌లు గ్రామంలో అనుమాన్న ప్రతి ఇంటిని, వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటలక్ష్మి మాట్లాడుతూ రంగాపురంను సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

జోరుగా పారిశుధ్య పనులు

మధురపూడి: మండల గ్రామాల్లో పారిశుధ్య పనులు జోరుగా సాగుతున్నాయి. స్వచ్ఛ గ్రామాల్లో భాగంగా పారిశుధ్యం పనుల్లో భాగంగా ఉదయం 6 గంటల నుంచి 8 గంటలలోపు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలోని పారిశుధ్య కార్మికులు రోడ్లపై ఉన్న చెత్తను తొలగిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించి, డంపింగ్ యార్డుకు తీసుకెళ్తున్నారు. దీంతో పాటు మురుగునీటి కాలువల శుభ్రపరుస్తున్నారు.